## లక్ష్మీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

మోర్తాడ్, డిసెంబర్ 16: దొన్కల్ గ్రామంలోని శ్రీభూనీల గోదా సమేత లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు శనివారం ప్రారంభమైనట్లు ఆలయ కమిటీ చైర్మన్ గడ్డం శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. శనివారం ధ్వజారోహణం, ఆదివారం శ్రీవారి కల్యాణం, అన్నదానం, సోమవారం సామూహిక సత్యనారాయణ వ్రతం, అన్నదానం, మంగళవారం జాతర, రథోత్సవ కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు తెలిపారు.

## రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

నవీపేట, డిసెంబర్ 16: మండల కేంద్రంలో లిటిల్ ఫ్లవర్ స్కూల్‌కు చెందిన విద్యార్థులు రాష్ట్ర స్థాయి నెట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు ఆ పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్ శనివారం తెలిపారు. రెంజల్ మండలంలోని తాడ్‌బిలోలిలో శుక్రవారం నిర్వహించిన జిల్లా స్థాయి యూ అండర్ –17 నెట్‌బాల్ టోర్నమెంట్ క్రీడా పోటీలో పాఠశాలకు చెందిన నిత్యారెడ్డి, లాస్య గెలుపొంది రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని పేర్కొన్నారు. వచ్చే నెలలో మహబూబ్‌నగర్ జిల్లాలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి నెట్‌బాల్ పోటీల్లో వారు పాల్గొంటారని తెలిపారు. ఎంపికైన విద్యార్థులను కరస్పాండెంట్ మేకల హన్మాండ్లు, పీఈటీ, ఉపాధ్యాయులు అభినందించారు.

## తోటబావిలో పడి వృద్ధుడి మృతి


గంగారాం (ఫైల్)

నందిపేట్, డిసెంబర్ 16: డొంకేశ్వర్ మండలంలోని నూత్‌పల్లి గ్రామంలో వ్యవసాయ తోటబావిలో పడి మాక్లూర్ మండలం కల్లెడ గ్రామానికి చెందిన కోంద్ర చిన్న గంగారాం (65) అనే వృద్ధుడు మృతి చెందినట్లు ఎస్సై రాహుల్ తెలిపారు. ఎస్సై కథనం మేరకు.. గంగారాం కొన్నేండ్ల క్రితం మతిస్థిమితం కోల్పోయాడు. ఈనెల 13న ఇంటి నుంచి వెళ్లిన ఆయన తిరిగి రాలేదు. నూత్‌పల్లిలోని వ్యవసాయ బావిలో శనివారం మృతదేహం లభించింది. చిన్నకూతురు ఇంటికి వచ్చి ఉంటాడని, కాలకృత్యాలకు వెళ్లి ప్రమాదవశాత్తు బావిలో పడి మృతి చెంది ఉంటాడని భావిస్తున్నారు. మృతుడి కుమారుడు కోంద్ర మధు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమారం నిమిత్తం దవాఖానకు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

## ప్రమాదంలో ఒకరు..

ఆర్మూర్‌టౌన్, డిసెంబర్16: పెర్కిట్ శివారులో జాతీయ 44వ రహదారిపై ఓ ప్రైవేట్ బస్సు ఢీకొని సైకిల్‌పై వెళ్తున్న సదామస్తుల రమేశ్ (67) మృతి చెందాడు. పోలీసులు కథనం మేరకు.. చేపూర్ గ్రామానికి చెందిన రమేశ్ పెర్కిట్ సబ్‌స్టేషన్‌లో నైట్ వాచ్‌మన్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. శనివారం ఉదయం విధులు ముగించుకొని చేపూర్ గ్రామానికి సైకిల్‌పై వెళ్తున్నాడు. జాతీయ రహదారి దాటుతుండగా నిర్మల్ నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న ప్రైవేట్ బస్సు ఢీకొట్టింది. రమేశ్ అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. మృతదేహన్ని పోస్ట్‌మార్టం కోసం ప్రభుత్వ దవాఖానకు తరంచారు. మృతుడి కుమారుడు వినాయక్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## బీమా చెక్కు అందజేత

ఎడపల్లి, డిసెంబర్ 16: మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన రమేశ్‌గౌడ్ ఇటీవల ప్రమాదవశాత్తు మృతి చెందాడు. మృతుడికి ఎడపల్లిలోని తెలంగాణ గ్రామీణ బ్యాంకులో జనరల్ ఇన్సురెన్స్ కలిగి ఉండడంతో రూ.10 లక్షల చెక్కును మృతుడి భార్య సాహితికి తెలంగాణ గ్రామీణ బ్యాంకు చైర్మన్ శోభ శనివారం అందజేశారు. కార్యక్రమంలో బ్యాంకు మేనేజర్ మేఘన, సిబ్బంది వెంకటేశ్, దివ్య పాల్గొన్నారు.

# ప్రజావ్యతిరేక విధానాలపై పోరాడాలి

- రైతు వ్యతిరేక చట్టాల అమలుకు మోదీ సర్కారు కుట్ర
- సీపీఐ(ఎంఎల్) న్యూ డెమొక్రసీ జిల్లా కార్యదర్శి పాపయ్య

భీమ్‌గల్, డిసెంబర్ 16: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పోరాటాలే పిట్ల ఎల్లన్నకు నిజమైన నివాళి అని సీపీఐ(ఎంఎల్) న్యూ డెమొక్రసీ జిల్లా కార్యదర్శి ఆకుల పాపయ్య అన్నారు. మండల కేంద్రంలో శనివారం ఆపార్టీ ఆధ్వర్యంలో పిట్ల పాపన్న 32వ వర్ధంతి నిర్వహించారు. ఎల్లన్న స్మారక స్థూపం వద్ద పూల మాలలు వేసి నివాళులర్పించి భారీ ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో న్యూ డెమొక్రసీ జిల్లా కార్యదర్శి మాట్లాడారు. ఎల్లన్న పేదింట్లో పుట్టి కష్టజీవుల రాజ్యం కోసం కదం తొక్కాడన్నారు. రైతు కూలీలు, ప్రజా సమస్యలపై అనేక పోరాటాలు నిర్వహించి జన హృదయంలో నిలిచారన్నారు. రైతులకు వ్యతిరేకమైన మూడు చట్టాలను మోదీ సర్కారు తిరిగి అమలు చేయడానికి కుట్ర చేస్తోందన్నారు. కార్యక్రమంలో కార్మిక సంఘ నాయకులు మంగ, దాసు, పిట్ల సరిత, సూర్య శివాజీ, ఖాజామొయినుద్దీన్, లింబాద్రి, ధర్మపురి, మల్కి సంజీవ్, పద్మ, భూమేశ్, అరుణోదయ కళాకారులు, పోశెట్టి, రంజిత్, భారతి పాల్గొన్నారు.


ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఐ(ఎంఎల్) నాయకులు, కార్యకర్తలు

# ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

### జడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు

నందిపేట్, డిసెంబర్ 16: ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని జడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు అన్నారు. కొండూర్ గ్రామంలో శనివారం నిర్వహించిన వీక్షిత్ భారత్ సంకల్ప్ యాత్రలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. శనివారం నుంచి జనవరి 4 వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుందని అన్నారు. రోజుకు రెండు గ్రామాల్లో కార్యక్రమం నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో అర్హులైన వారి నుంచి పెన్షన్లు, గృహనిర్మాణాలు తదితర సంక్షేమ పథకాలకు సంబంధించి దరఖాస్తులు తీసుకుంటారన్నారు. కార్యక్రమంలో జడ్పీ సీఈవో గోవింద్, ఎంపీడీవో నాగవర్ధన్, తహసీల్దార్ ఆనంద్‌కుమార్, సర్పంచ్ ప్రభాకర్, ఎంపీవో కిరణ్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న దాదన్నగారి విఠల్‌రావు

**సద్వినియోగపర్చుకోవాలి**

వేల్పూర్, డిసెంబర్ 16: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగపర్చుకోవాలని ఎంపీ ధర్మపురి అరవింద్ అన్నారు. మండలంలోని లక్కోరా గ్రామంలో ఏర్పాటు చేసిన వికసిత్ భారత్ సంకల్ప్‌యాత్ర కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించి మాట్లాడారు. పీఎం ఆన్‌లైన్ ద్వారా దేశంలోని వివిధ రాష్ట్రాల ప్రజలతో మాట్లాడిన కార్యక్రమాన్ని ఎంపీ, అదనపు కలెక్టర్ చిత్రామిశ్రా, జిల్లాస్థాయి అధికారులు, లక్కోరా ప్రజలు ప్రత్యక్షంగా వీక్షించారు.

**అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలి**

రెంజల్, డిసెంబర్ 16: వీక్షిత్ భారత్ సంకల్ప యాత్ర ద్వారా అర్హులైన వారు కేంద్ర ప్రభుత్వ పథకాల కోసం దరఖాస్తు చేసుకోవాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు బస్వా లక్ష్మీనర్సయ్య సూచించారు. మండలంలోని కిసాన్‌తండా, కూనేపల్లి, కళ్యాపూర్, బాగేపలి గ్రామాల్లో వీక్షిత్ భారత్ సంకల్ప యాత్ర వాహనంలో టీవీ ద్వారా ప్రధాని నరేంద్ర మోదీ సందేశాన్ని వీక్షించే కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ మాలోత్ జమున, ఎంపీడీవో శంకర్, ఎంపీపీ రజిని, జడ్పీటీసీ విజయా సంతోష్, బీజేపీ మండలాధ్యక్షుడు గోపి, ఏవో లక్ష్మీకాంత్‌రెడ్డి, కార్యదర్శి సాయిబాబా, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

## మొక్కు చెల్లించుకున్న బీఆర్ఎస్ నాయకులు


మొక్కులు తీర్చుకుంటున్న ముప్కాల్ మండల నాయకులు

మెండోరా, డిసెంబర్ 16: శాసనసభ ఎన్నికల్లో బాల్కొండ నియోజకవర్గ ఎమ్మెల్యేగా వేముల ప్రశాంత్‌రెడ్డి మూడో సారి గెలిచినందుకు భీమ్‌గల్ లక్ష్మీనర్సింహస్వామికి ముప్కాల్ మండల నాయకులు శనివారం మొక్కు చెల్లించారు. రెంజర్ల ప్రాథమిక సహకార సంఘం చైర్మన్ కోమటిశెట్టి గంగాధర్, వైస్ ఎంపీపీ ఆకుల చిన్న రాజన్న లక్ష్మీ నర్సింహస్వామి ఆలయంలో 101 కొబ్బరి కాయలు కొట్టి పొర్లు దండాలతో భగవంతుని మొక్కు తీర్చుకున్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ మగ్గిడి మోహన్‌రెడ్డి, ఆకుల రాజేందర్, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

## బస్సు ఎదుట వ్యక్తి ఆందోళన


ఆర్టీసీ బస్సు ఎదుట ఆందోళన చేస్తున్న యువకుడు

ఆర్మూర్‌టౌన్, డిసెంబర్16: ఆర్టీసీ బస్సు ఎదుట ఓ వ్యక్తి ఆందోళన చేపట్టిన ఘటన పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో శనివారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. ఆర్మూర్ నుంచి వరంగల్ వైపు వెళ్తున్న బస్సులో ఓవ్యక్తి తన భార్య, కూతురుతో ఎక్కాడు. భార్య, కూతురు ఉచిత ప్రయాణం చేస్తున్నారు. తాను కండక్టర్ నుంచి టికెట్ తీసుకున్నాడు. బస్సులో కూర్చోవడానికి సీటు దొరకకపోవడంతో బస్సు దిగి ఆందోళనకు దిగాడు. ఉచితంగా ప్రయాణిస్తున్న మహిళలు సీట్లలో కూర్చున్నారని, టికెట్ తీసుకున్న తాను నిలబడాల్సి వచ్చిందని పేర్కొన్నాడు. బస్సులో టికెట్ తీసుకున్న పురుషులకు సీట్లు కేటాయించాలని డిమాండ్ చేశాడు.

## విద్యార్థులకు పోటీలు


విద్యార్థినికి బహుమతి అందజేస్తున్న శంకర్

రెంజల్, డిసెంబర్ 16: మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో శనివారం సీవీ రామన్ జయంతి పురస్కరించుకొని విద్యార్థులకు మండల స్థాయి రంగోళీ, క్విజ్, లలిత సంగీతం పోటీలు నిర్వహించారు. ఈసందర్భంగా పీఆర్టీయూ గౌరవ అధ్యక్షుడు ఇల్తెపు శంకర్ మాట్లాడుతూ విద్యార్థుల్లో పోటీ తత్వాన్ని పెంపొందించేందుకు విశ్రాంత హెచ్ఎం విజయానంద్ రావు ప్రోత్సాహం అభినందనీయమని కొనియాడారు. పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన రెంజల్ ఆదర్శ, జడ్పీహెచ్ఎస్ రెంజల్, జడ్పీహెచ్ఎస్ కూనేపల్లి విద్యార్థులకు డిక్షనరీలు, జనరల్ నాలెడ్జ్ పుస్తకాలను అందజేశారు. కార్యక్రమంలో పీఆర్టీయూ మండలాధ్యక్షుడు తాళ్ల సోమలింగంగౌడ్, రెంజల్ హెచ్ఎం ఆంజనేయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## సమాచార హక్కు చట్టం ‘వజ్రాయుధం’

ఆర్మూర్‌టౌన్, డిసెంబర్16: సమాచార హక్కు చట్టం వజ్రాయుధం లాంటిదని సమాచార హక్కు చట్టం జిల్లా కన్వీనర్, న్యాయవాది గటడి ఆనంద్ అన్నారు. అర్మూర్ పట్టణంలోని సాయి ఒకేషనల్ జూనియర్ కళాశాలలో సమాచార హక్కు చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు.

## సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత


సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేస్తున్న కౌన్సిలర్ సంగీత

ఆర్మూర్‌టౌన్, డిసెంబర్16: పట్టణంలోని రెండో వార్డు కౌన్సిలర్ సంగీత శనివారం బాధితుడు బానుచందర్‌కు సీఎంఆర్ఎఫ్ చెక్కును శనివారం అందజేశారు. బాధితుడి ఇంటికి వెళ్లి రూ.18,500 విలువైన చెక్కును కౌన్సిలర్ అందజేశారు.

## రైస్ మిల్లుల్లో పౌరసరఫరాలశాఖ తనిఖీలు

బోధన్, డిసెంబర్ 16: బోధన్ ప్రాంతంలోని పలు రైస్‌మిల్లుల్లో పౌరసరఫరాలశాఖ, టాస్క్‌ఫోర్స్ అధికారులు రెండు రోజులుగా తనిఖీలు చేపడుతునారు. పలు రైస్‌మిల్లుల్లో కస్టమ్ ధాన్యం పక్కదారి పట్టినట్లు పౌరసరఫరాలశాఖ అధికారులు అనుమానిస్తున్నారు. శనివారం ప్రారంభమైన తనిఖీలు ఆదివారం కొనసాగాయి. ఈ తనిఖీల్లో జిల్లా పౌరసరఫరాల అధికారి చంద్రప్రకాశ్, పౌరసరఫరాల సంస్థ డీఎం జగదీశ్, టాస్క్‌ఫోర్స్ ఓఎస్‌డీ శ్రీధర్‌రెడ్డి తదితరులు ఉన్నారు. వీరు ముందుగా బోధన్ మండలంలోని తగ్గెల్లిలో ఒకే సముదాయంగా మూడు రైస్ మిల్లులను తనిఖీచేశారు. ఉన్నతాధికారులకు నివేదిక పంపుతామని వారు పేర్కొన్నారు.

## కరపత్రాల ఆవిష్కరణ

బోధన్, డిసెంబర్ 16: పట్టణంలోని శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం ఆలయ కమిటీ ప్రతినిధులు ముక్కోటి ఏకాదశికి సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈనెల 23న శనివారం ముక్కోటి ఏకాదశిలో భాగంగా ఉత్తరద్వార దర్శనంతో పాటు ఆలయంలో నిర్వహించే ప్రత్యేక కార్యక్రమాలను వివరించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరు కావాలని ఆలయ కమిటీ గౌరవ అధ్యక్షుడు పూదోట రవికిరణ్, ఆలయ కమిటీ నిర్వాహకులు, యాజ్ఞీకులు శ్రీధరాచారి, పూజారి దీపక్‌పాండే కోరారు.

## ఉచిత రక్తదానం శిబిరం

బాల్కొండ, డిసెంబర్ 16: బోదేపల్లిలో ప్రాణాదార బ్లడ్ సెంటర్ ఆర్మూర్ ఆధ్వర్యంలో శనివారం రక్తదాన శిబిరం నిర్వహించినట్లు యూత్ సభ్యులు తెలిపారు. 14 మంది యూత్ సభ్యులు పాల్గొనగా 12 మంది యువకులు రక్తదానం చేసినట్లు వైద్యులు ప్రవీణ్, ప్రతాప్ తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ నోముల రవి, యువకులు కోట గోపాల్, రోహిత్, రంజిత్, దేవేందర్, శ్రీకాంత్, అనిల్‌కుమార్, హరీశ్, గంగాధర్, వివేక్, నరేశ్, పాల్గొన్నారు.